
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
బుధవారం 18 జూన్ 2025



ప్రధాన పార్టీల్లో గ్రూపు రాజకీయాలు

- కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ అధిష్ఠానాలకు తలనొప్పి
- స్థానిక ఎన్నికల నేపథ్యంలో ఆశావహుల్లో ఆందోళన
- ఫలితాలపై కార్యకర్తల్లో గుబులు

జగిత్యాల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలలో ప్రధాన పార్టీలు గ్రూపు రాజకీయాలతో సతమతమవుతున్నాయి. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీల్లో బహుళ నాయకత్వం వల్ల ఎవరికి వారే యమునాతీరే అన్న చందంగా మారింది. దీంతో ఆయా పార్టీల అధిష్ఠానాలకు జగిత్యాల రాజకీయాలు తలనొప్పిగా మారాయి. త్వరలో మున్సిపల్, జిల్లా పరిషత్, మండల పరిషత్, పంచాయతీలకు ఎన్నికలు జరగనుండడంతో ఆయా రాజకీయ పక్షాల్లో నెలకొన్న పరిస్థితి అటు కార్యకర్తలకు, ఇటు అధిష్ఠానాలకు ఇబ్బందిగా తయారైంది. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆశించిన ఫలితాలు రాకుండా పోతాయన్న ఆందోళన ఆయా పార్టీల శ్రేణుల్లో నెలకొంది.

ఎమ్మెల్యే పార్టీ మార్పుతో కాంగ్రెస్‌లో మారిన రాజకీయం..

కొన్ని సంవత్సరాలుగా జగిత్యాల కాంగ్రెస్ రాజకీయాలు మాజీ మంత్రి జీవన్‌రెడ్డి కనుసన్నల్లో ఉంటూ వస్తున్నాయి. కానీ 2019, 2024 అసెంబ్లీ ఎన్నికల్లో, 2025 పార్లమెంట్ ఎన్నికల్లో వరుసగా ఓటమి పాలుకావడంతో పాటు పట్టభద్రుల ఎమ్మెల్సీ పదవీ కాలం కూడా ముగియడంతో ఆయన రాజకీయ భవిష్యత్‌పై స్పష్టత కొరవడినట్లయింది. ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత బీఆర్‌ఎస్ తరపున 2014లో మొదటిసారి జీవన్‌రెడ్డి చేతిలో ఓడిపోగా, ఆ తర్వాత 2019, 2024ల్లో జరిగిన ఎన్నికల్లో మంచి మెజార్టీతో గెలుపొందారు.

అయితే 2024 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా విజయం సాధించి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో హస్తం కండువా కప్పుకున్నారు. ఇక అప్పటి నుంచి జగిత్యాల కాంగ్రెస్‌లో రాజకీయ వేడి పెరిగింది. అప్పటి వరకు జగిత్యాల కాంగ్రెస్ బాధ్యతలను నిర్వర్తిస్తున్న మాజీ మంత్రి జీవన్‌రెడ్డి తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు.

అటు జీవన్‌రెడ్డి, ఇటు సంజయ్‌కుమార్ మధ్య రాజకీయాలు పచ్చగడ్డి వేస్తే భగ్గు మంటున్నాయి. దీంతో ఆ గట్టున ఉండాలా...ఈ గట్టున ఉండాలా తెలి యక కార్యకర్తలు తిక మక పడుతున్నారు. రాను న్న స్థానిక ఎన్నికల్లో ఎవరిది పైచేయి ఉంటుందనే గుసగుసలు వినిపిస్తున్నాయి. డీసీసీ అధ్యక్షుడిగా ఉన్న అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఇటీవలే మంత్రిగా బాధ్యతలు చేపట్టగా ఇద్దరు నేతల మధ్య సయోధ్య కుదుర్చేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. ఒకవైపు ఇన్నాళ్లు తన వెన్నంటి ఉన్న మాజీ మంత్రి జీవన్‌రెడ్డి, మరోవైపు సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కండువా కప్పుకున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌ల మధ్య మంత్రి ఇరకాటంలో పడినట్లయింది.

బీఆర్‌ఎస్‌లో పార్టీలో..

బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడిగా కోరుట్ల మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు కొనసాగుతున్నారు. కానీ జగిత్యాలలో మాత్రం ఎమ్మెల్సీ ఎలగందుల రమణ, మాజీ జడ్పీ ఛైర్‌పర్సన్ దావ వసంత రాజకీయాల్లో కీలకంగా వ్యవహరిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల వరకు బీఆర్‌ఎస్ బాధ్యతలను నిర్వర్తించిన జగిత్యాల ఎమ్మెల్యే మాకునూరి సంజయ్ కుమార్ పార్టీని వీడడంతో క్యాడర్ పరిస్థితి గందరగోళంగా తయారైంది. కొంత క్యాడర్ ఎమ్మెల్యే సంజయ్ వెంట ఉండగా, మరికొంత క్యాడర్ విడిపోయింది. ఎమ్మెల్సీ రమణ, మాజీ జడ్పీ ఛైర్‌పర్సన్ వసంత సురేశ్‌లకు సమీపంగా కొంత మంది కార్యకర్తలుంటున్నారు. వీరిలో ఎమ్మెల్సీ రమణ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు దగ్గరగా ఉంటారు. జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ దావ వసంత ఎమ్మెల్సీ కవితకు దగ్గరగా ఉంటారు.

ప్రస్తుతం జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ వసంతనే అన్నీ తానై పట్టించుకుంటున్నారు. ఎమ్మెల్సీ కవిత కూడా వీలు కుదిరినప్పుడల్లా జగిత్యాలలో ఏదో ఒక కార్యక్రమం పెట్టుకుని మరీ వస్తున్నారు. బీఆర్‌ఎస్‌లో రాష్ట్ర స్థాయిలో చోటుచేసుకున్న ఎమ్మెల్సీ కవిత వ్యవహారం జగిత్యాలపై ప్రభావం చూపుతోంది. ఎవరి వెంట ఉండాల్లో, భవిష్యత్తులో ఎవరిదిపై చేయిగా నిలుస్తుందో తెలియని గందరగోళ పరిస్థితిని బీఆర్‌ఎస్ క్యాడర్ ఎదుర్కొంటోంది. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎవరిది పైచేయిగా ఉంటుందోనని నాయకులు, కార్యకర్తలు ఆలోచనలో పడ్డారు.

మొదటి నుంచి బీజేపీలో బహుళ నాయకత్వమే..

జగిత్యాల బీజేపీలో చాలా ఏళ్లుగా బహుళ నాయకత్వమే నడుస్తుందనే చెప్పవచ్చు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ముదుగంటి రవీందర్‌రావు, మోరపల్లి సత్యనారాయణల వర్గాలు వేర్వేరుగానే 8లో

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్



సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్

మల్యాల, జూన్ 17(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్ ప్రజలకు సూచించారు. మల్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తూ వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. జ్వర పీడితులకు రక్త పరీక్షలు చేసి మందులు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. అనంతరం ఆరోగ్య కేంద్రాల వారీగా రికార్డులు పరిశీలించారు. డీఎంహెచ్‌వో వెంట జిల్లా ప్రోగ్రాం అధికాలు డాక్టర్ సమియోద్దీన్, ఆకుల శ్రీనివాస్, డీపీవో రవీందర్, వైద్యాధికారి మౌనిక, మలేరియా అధికారి సత్యనారాయణ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లు పెంచాలి

జగిత్యాల అర్బన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లు పెంచి చట్టబద్ధత కల్పించాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదించడం హర్షణీయ మైనప్పటికీ బిల్లును కేంద్ర ప్రభుత్వం ఆమోదింపక పోవడం పట్ల అనుమానాలు తలెత్తుతున్నాయన్నారు. బీసీ రిజర్వేషన్ బిల్లును కేంద్ర ప్రభుత్వంపై నెట్టేసి బీసీలకు మొండి చేయి చూపించే ప్రయత్నాలను కాంగ్రెస్ పార్టీ మానుకోవాలని ఆయన సూచించారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకు వచ్చి బీసీ బిల్లు ఆమోదించాలని చూడాలన్నారు. అప్పటి వరకు రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించకూడదని ఆయన డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ బిల్లు సాధన కోసం ఈ నెల 18న చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని తలపెట్టామన్నారు. ఈ కార్యక్రమాన్ని బీసీలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు కొక్కు గంగాధర్, తిరుపురం రాచంద్రం, రాచకొండ రోజా, రాపర్తి రవి, అనుమల్ల సంజయ్ స్వామాట్, బండపెల్లి మల్లీశ్వరి, రాపర్తి వినోద్ పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు

జగిత్యాల ఆర్డీవో మధుసూదన్



గ్రామస్థుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీవో మధుసూదన్

ధర్మపురి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని జగిత్యాల ఆర్డీవో మధుసూదన్ అన్నారు. ధర్మపురి మండలంలోని పెద్దనక్కలపేట గ్రామపంచాయితీ వద్ద ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో అవకతవకలు జరిగాయని సోమవారం మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో జగిత్యాల ఆర్డీవో మదుసూధన్ అధికారులతో కలిసి గ్రామానికి వెళ్లి మహిళలతో మంగళవారం మాట్లాడారు. గ్రామంలో కొందరు అర్హత కలిగి ఉన్న వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాలేదని తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్లు మంజూరు చేస్తామని ఆయన తెలిపారు. కొందరు మహిళలు తాము పాత ఇళ్లు కూలగొట్టుకున్నామని, తమకు ఇళ్లు మంజూరు చేయలేదని ఆర్డీవో దృష్టికి తీసుక వెళ్లారు. ఇళ్లు కూలగొట్టుకున్న వారికి కూడా త్వరలో మంజూరు పత్రాలు ఇస్తామని ఆయన అన్నారు. త్వరలోనే అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు జాబితాలో చోటు చేసుకుంటుందని ఆయన తెలిపారు. అనంతరం ఆయన ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఆయన వెంట ధర్మపురి ఎంపీడీవో రవీందర్, ఇన్‌చార్జి తహసీల్దార్ సుమన్, గ్రామపంచాయితీ కార్యదర్శి మురళి, టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, ఏఎంసీ వైస్‌చైర్మన్ సంగ నర్సింహులు, బాదినేని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా నిధులు విడుదల 8

మధ్యాహ్న భోజన కార్మికులకు వైద్య పరీక్షలు

బుగ్గారం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మధ్యాహ్న భోజన కార్మికులకు మంగళవారం మండల విద్యా వనరుల కేంద్రంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌బీ ఎస్‌కె వైద్యులు వెంకటేష్, మహేశ్వరిలు మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు మధ్యాహ్న భోజన కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. వారి రక్త నమూనాలు సేకరించి, షుగర్, హెచ్ఐవీ, హెచ్‌బీ, వైరల్ ఫీవర్ వంటి పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి వెంకటేశ్వర్లు, సీఆర్‌పీ పురుషోత్తం, సీసీవో హరిత, ఏఎస్ఎం రాజేశ్వరి, ఫార్మాసిస్టులు శృతి, సైఫోద్దీన్ పాల్గొన్నారు.

విద్యుత్ మరమ్మతు పనులు చేపట్టిన అధికారులు

కోరుట్ల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలో విద్యుత్ అధికారులు మంగళవారం మరమ్మతు పనులు చేపట్టారు. మూడు రోజుల క్రితం 33/11 కేవి విద్యుత్ వైర్లు తగిలి ఇద్దరు మృతి చెందడంతో విద్యుత్ శాఖ అధికారులు ప్రత్యేక మరమ్మతు చర్యలు చేపట్టారు. మంగళవారం విద్యుత్ శాఖ అధికారులు సంఘటన స్థలం వద్ద కిందికి ఉన్న లైన్‌ను ఎత్తైన విద్యుత్ స్తంభం ఏర్పాటు చేసి వైర్లను పైకి లేపారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న 33/11 కేవి లైన్లను పరిశీలించారు. పలు ప్రాంతాల్లో లైన్ ఎత్తు పెంచడానికి ఉన్నత అధికారులకు నివేదికను పంపారు. ఇటీవల జరిగిన ప్రమాదంలో స్పందించిన అధికారులు ప్రత్యేక చర్యలను చేపట్టారు.

ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

- ఎస్పీ అశోక్ కుమార్ ● పోలీస్ స్టేషన్ల ఆకస్మిక తనిఖీ



రాయికల్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎస్పీ

రాయికల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఫిర్యాదులపై పోలీసులు తక్షణమే స్పందించాలని ఎస్పీ అశోక్‌కుమార్ సిబ్బందిని ఆదేశించారు. ప్రజలకు అందుబాటులోకి ఉంటూ సమర్థవంతమైన సేవలు అందించాలని ఆయన అన్నారు. రాయికల్ పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ పరిసరాలను, స్టేషన్ పరిధిలో నమోదవుతున్న, నమోదైన కేసుల వివరాలు, స్టేషన్ రికార్డులను తనిఖీ చేశారు. ప్రజల ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా బాధితుల ఫిర్యాదుల పట్ల తక్షణమే స్పందించాలన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటలో ఉండాలని సూచించారు. బ్లూ కోల్ట్, పెట్రో కార్ సిబ్బంది 100 డయల్ కాల్స్‌కు తక్షణమే స్పందిస్తూ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి చూపుతూ, స్టేషన్ పరిధిలోని గ్రామాలను తరచూ సందర్శించాలన్నారు. పాత నేరస్థులపై నిఘా ఉంచాలన్నారు. నేరాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎస్పీ ఆదేశించారు.

ప్రజలతో సత్సంబంధాలను మెరుగు పరుచుకుంటూ ప్రజలకు, యువతకు ప్రత్యేకంగా షీ టీమ్స్, ట్రాఫిక్ నియమాలు, సైబర్ నేరాల నివారణపై చైతన్యాన్ని తీసుకురావాలని ఎస్పీ సూచించారు. విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని యువకులను మోసం చేసేవారి పట్ల కఠినంగా వ్యవహరించాలని సూచించారు. ఎస్పీ వెంట ఎస్సై సుధీర్‌రావు, ఏఎస్సై దేవేందర్, సిబ్బంది ఉన్నారు.

మల్లాపూర్ పోలీస్ స్టేషన్ తనిఖీ

● **మల్లాపూర్:** మల్లాపూర్ మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌ను ఎస్పీ అశోక్‌కుమారు మంగళ వారం తనిఖీ చేశారు. పోలీసు స్టేషన్‌లోని రికార్డులు, రిసెప్షన్, లాకప్, మెన్‌బ్యారక్, టెక్నికల్ రూం, పరిసరాలను



మల్లాపూర్ స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్పీ

పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి వారి విధులకు సంబంధించిన సూచనలు చేశారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎస్సై రాజు పలు సూచనలు చేశారు. ఎళ్లవేళా ఫిర్యాదులు స్వీకరించడం, బాధితుల ఫిర్యాదుపై సత్వరం స్పందించి సేవలు అందించా లన్నారు. బ్లూ కోల్ట్, పెట్రోకార్ సిబ్బంది 100 డయల్ కాల్స్‌కి తక్షణమే స్పందిస్తూ వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు అమర్చే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు, అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని పలు సూచనలు చేశారు. అనంతరం సీఐ అనిల్ మల్లాపూర్ పోలీసు స్టేషన్ సందర్శించారు. కార్యక్రమంలో ఎస్సై రాజు పాల్గొన్నారు.

'పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం'

పెగడపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పెగడపల్లి మార్కెట్ కమిటీ ఛైర్మన్ బుర్ర రాములు గౌడ్ పేర్కొన్నారు. పెగడపల్లి మండలంలోని 93 మంది లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మంగళవారం పార్టీ నాయకులతో కలసి రాములు గౌడ్ మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాములు గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వెంటనే ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు.ప్రజల ఆరోగ్య పరిరక్షణకు గతంలో ఐదు లక్షలు ఉన్న ఆరోగ్యశ్రీ పరిమితిని 10 లక్షల రూపాయలకు పెంచడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సంధి మల్లారెడ్డి, అనీల్‌గౌడ్, రాజు, బండారి శ్రీనివాస్, భాస్కర్, ఎలగొండ కృష్ణహరి, పూసాల తిరుపతి, కడారి తిరుపతి, అమిరిశెట్టి లక్ష్మినారాయణ, చెట్ల కిషన్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి

పెగడపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో ముందుకు సాగుతూ దేశం గర్వపడేలా ఎదగాలని మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సంధి మల్లారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పెగడపల్లి మండలంలోని అయిత్‌పల్లి గ్రామంలో అయిత్‌పల్లి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ ముగింపు వేడుకలలో పాల్గొని టోర్నీ విజేతలకు మల్లారెడ్డి నగదు ప్రోత్సాహకం అందించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు, చెడు వ్యసనాలకు బానిస కాకూడదని, క్రీడల్లో గెలు పోటములను క్రీడా స్ఫూర్తిగా తీసుకుంటూ మరింత పట్టుదలతో ఆడుతూ ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బొమ్మగోని జితేందర్‌గౌడ్, పలుమారు అంజయ్య, గంగయ్య, మల్లయ్య, జలందర్, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించాలి

- జిల్లా సంక్షేమాధికారి నరేష్



చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న జిల్లా సంక్షేమాధికారి నరేష్

రాయికల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని జిల్లా సంక్షేమాధికారి డాక్టర్ నరేష్ అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆట, పాటలతో కూడిన విద్య లభిస్తుందని ఆయన అన్నారు. రాయికల్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం అమ్మ మాట-అంగన్‌వాడీ బాట ముగింపు కార్యక్రమంలో భాగంగా సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమాధికారి నరేష్ మాట్లాడుతూ ఆట, పాటలతో విద్య పిల్లల మెదడుపై భారం లేకుండా ఉంటుందన్నారు. పోషణ లోపం ఉన్న పిల్లలకు బాలామృతం ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జగిత్యాల ప్రాజెక్ట్ సీడీపీవో మమత, రాయికల్ మున్సిపల్ కమిషనర్ మనోహర్, తహసీల్దార్ నాగార్జున, మెప్మా టీఎల్ఎం శరణ్య, ఈవో పవిత్ర, జిల్లా మిషన్ శక్తి కోఆర్డినేటర్ అశ్విని, హేమ, హెల్త్ సూపర్‌వైజర్లు శ్రీనివాస్, ఉమ పాల్గొన్నారు.

జిల్లా న్యాయమూర్తిని కలిసిన బార్ అసోసియేషన్ సభ్యులు

కోరుట్ల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణ బార్ అసోషియేషన్ సభ్యులు మంగళవారం జిల్లా న్యాయమూర్తి రత్న పద్మావతిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి అంబేద్కర్ చిత్రపటాన్ని జ్ఞాపికగా అందించి సత్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ సభ్యులు కోరుట్ల పట్టణం శివారులో నూతనంగా నిర్మాణ చేస్తున్న భవనను పరిశీలించి పనులు త్వరగా అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా న్యాయమూర్తిని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసి యేషన్ సభ్యులు భైరి విజయ్ కుమార్, కొంపల్లి సురేష్, సుతారి నవీన్, కడకుంట్ల సదాశివరాజు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

కోరుట్ల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : మూడు రోజుల క్రితం విద్యుదాఘాతంతో మృతిచెందిన కుంటుబాలకు ప్రభుత్వం వెంటనే ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, సంఘటనలో గాయపడిన వారికి ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించాలని టీడీపి నియోజకవర్గ ఇన్‌చార్జి మానుక ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ఏసీకోగుట్ట ప్రాంతానికి చెందిన సాయికుమార్, ప్రకాశం రోడ్డుకు చెందిన అల్వాల మహేష్ కుటుంబాలను మానుక ప్రవీణ్ స్థానిక నాయకులతో కలిసి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మహదేవ్, ఎండి రఫీయేద్దిన్, బాల మారుతి, గంగుల శ్రీనివాస్, వీరబత్తినిలత పాటు పలువురు పాల్గొన్నారు.

ఇజ్రాయెల్‌లో జగిత్యాల వాసి మృతి


రవీందర్ (ఫైల్)

జగిత్యాల అర్బన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): బతుకు దెరువు కోసం ఇజ్రాయెల్ దేశానికి వెళ్లిన జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన రెవెల్ల రవీందర్ (48) అనే వ్యక్తి రెండు రోజుల క్రితం గుండెపోటుతో మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇజ్రాయిల్‌లో కొన్ని రోజులుగా జరుగుతున్న యుద్ధం వల్ల ఎక్కడా పనిదొరక్క పోవడంతో పాటు అనారోగ్యానికి గురై వైద్యం అందక తన భర్త మృతి చెందాడని రవీందర్ భార్య విజయలక్ష్మి రోదిస్తూ తెలిపింది. రవీందర్ రెండేళ్ల క్రితం అప్పు చేసి ఇజ్రాయిల్ దేశానికి వెళ్లాడని అనంతరం కొన్ని రోజులకు అనారోగ్యం బారిన పడి తర్వాత కుదుటపడ్డాడని భార్య విజయలక్ష్మి పేర్కొన్నారు. ఇజ్రాయిల్‌లోని రమాత్‌గాన్ పట్టణంలో ఓ గదిలో ఉంటున్న రవీందర్ అనారోగ్యంతో రెండు రోజుల క్రితం మరణించాడని అతడితో గదిలో కలిసి ఉంటున్న వారు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కాగా మృతుడికి కూతురు ఆకాంక్ష, కుమారుడు అమర్‌నాథ్ ఉన్నారు. రవీందర్ కుటుంబ సభ్యులను జగిత్యాల మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ జ్యోతి దంపతులు మంగళవానం పరామర్శించారు.

రవీందర్ మృతి విషయం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌కు తెలియజేశామని, ఇజ్రాయిల్‌లోని భారత ఎంబసీ అధికారులను సంప్రదించి మృతదేహం త్వరగా స్వదేశానికి రప్పించే ఏర్పాటు చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నట్లు జ్యోతి తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

కరీంనగర్ క్రైం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం చింతకుంటలోని ఆర్‌కేనగర్‌లో మంగళవారం 13 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుకున్నట్లు కొత్తపల్లి ఎస్సై సాంబమూర్తి తెలిపారు. ఉదయం పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో ఒక గూడ్స్ క్యారియర్‌లో 35 బ్యాగులలో 13 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం గుర్తించామని పేర్కొన్నారు.

బియ్యం అక్రమంగా తరలిస్తున్న వాహన డ్రైవర్ తూర్పాటి క్రాంతి కుమార్, వాహన యజమాని హస్తం కారుణాకర్‌పై కేసు నమోదు చేశామని, బియ్యం సీజ్ చేశామని తెలిపారు. పట్టుబడిన బియ్యం విలువ రూ.28 వేలు ఉంటుందని పేర్కొ న్నారు.

బడిని కాపాడుకుందాం..

- ఒక నాడు ఎంతో మందిని తీర్చిదిద్దిన ఉల్లంపల్లి పాఠశాల
- నేడు విద్యార్థులు లేక ప్రశ్నార్థకంగా మారిన మనుగడ..

చిగురుమామిడి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఒక నాడు అనేక మందిని తీర్చిదిద్దిన పాఠశాల ఇది.. నేడు విద్యార్థులు లేక దాని మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. విద్యార్థుల సంఖ్యను పెంచుకునేందుకు గ్రామస్థులు పూనుకుంటేనే పాఠశాల బతుకుంది. లేకపోతే మూతపడే ప్రమాదంలో ఉంది. చిగురుమామిడి మండలంలోని ఉల్లంపల్లి ప్రాథమికోన్నత పాఠశాల లో ఎనిమిది తరగతులు ఉన్నాయి. ఈ పాఠశాల గతంలో పలు అంశాల్లో ఉమ్మడి జిల్లాలో ఆదర్శంగా నిలిచింది. ఈ పాఠశాలలో చదివిన విద్యార్థులు క్రీడాకారులుగా ఎదిగారు. పలువురు ఉన్నత స్థానాలకు చేరుకున్నారు. ఒకప్పుడు విద్యార్థులతో కళకళలాడిన పాఠశాలలో ప్రస్తుతం 13 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. పాఠశాలలో ఉన్న ఎనిమిది మంది ఉపాధ్యాయుల్లో ముగ్గురిని డిప్యుటేషన్‌పై వేరే పాఠశాలలకు కేటాయించారు. ప్రస్తుతం ఐదుగురు విదులు నిర్వహిస్తున్నారు. కనీసం 30 మంది విద్యార్థులు ఉంటేనే పాఠశాల కొనసాగుతుంది. గ్రామంలో అధికారులు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తు ప్రజలకు ప్రభుత్వ పాఠశాలలపై అవగహన కల్పించారు. అయిన గ్రామస్థులు తమ పిల్లలను చేర్పించేందుకు ఆసక్తి చూపించడం లేదు. విద్యార్థులకు ఇంగ్లీష్‌లో బోధించడానికి ఉపాధ్యాయులు సిద్ధంగా ఉన్నారు. గ్రామంలో ఇంటింటికి తిరిగి విస్తృతంగా ప్రచారం నిరహిస్తున్నా గ్రామస్థులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకే పంపుతున్నారు. పాఠశాలలో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. అయినా స్పందన కనిపించడం లేదు. ప్రభుత్వ పాఠశాలలో అన్ని రకాల అర్హత ఉన్న ఉపాధ్యాయులు ఉన్నారని, తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు బడికి పంపించాలని సిబ్బంది కోరుతున్నారు. గ్రామంలో ప్రభుత్వ పాఠశాల మూత పడితే అనేక ఇబ్బందులు వస్తాయని పూర్వ విద్యార్థులు అంటున్నారు. ఇక్కడ చదివిన విద్యార్థుల రికార్డులు మండలం కేంద్రానికి తీసుకెళ్తారని, ఏవైనా సర్టిఫికెట్స్ కావాలంటే ఇబ్బందులు ఎదురవుతాయని వారు ఆందోళన చెందుతున్నారు. గతంలో ఇక్కడ చదివిన వాళ్లు ఉన్నత స్థానాల్లో ఉన్నారని తెలుపుతున్నారు. తల్లిదండ్రులు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను వినియోగించుకోవాలని కోరుతున్నారు.


ఉల్లంపల్లిలో బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు (ఫైల్)


విద్యార్థులకు పూలతో స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు (ఫైల్)

నాణ్యమైన విద్యను అందిస్తాం..

- పాఠశాల ఉపాధ్యాయులు

ప్రభుత్వ పాఠశాలలో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా నాణ్యమైన విద్యను అందిస్తామని, లేకపోతే తమపై చర్యలు తీసుకోవచ్చని పాఠశాల ఉపాధ్యాయులు అంటున్నారు. పాఠశాలలో అన్ని రకాల సౌకర్యాలు ఉన్నాయని, ఉచితంగా విద్య, పుస్తకాలు, యూనిఫామ్స్ ప్రభుత్వం అందిస్తుందని తెలుపుతున్నారు. విద్యార్థులను క్రమశిక్షణ కలిగిన పౌరులుగా తీర్చిదిద్దుతామని అంటున్నారు.

అత్తపై దాడి కేసులో అల్లుడికి మూడేళ్ల జైలు శిక్ష

సిరిసిల్ల క్రైం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): అత్తపై దాడిచేసిన కేసులో అల్లుడికి మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ. 2వేల జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ మంగళవారం తీర్పు వెల్లడించారు. సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ వివరాల ప్రకారం... కరీంనగర్ పట్టణంలోని బోయవాడకు చెందిన రాపోలు శశికళ కూతురు పద్మావతిని సిరిసిల్ల పట్టణంలోని సిద్దులవాడలో ప్రేమ్‌సాగర్‌రావుకు 30ఏళ్ల క్రితం ఇచ్చి పెళ్లిచేశారు. కొంతకాలంగా పద్మావతి, ప్రేమ్‌సాగర్‌రావులు తరచూ గొడవ పెట్టుకుంటున్నారు. ఈ క్రమంలో మే 9, 2017న అత్త శశికళపై అల్లుడు ప్రేమ్‌సాగర్‌రావు దాడిచేసి కొట్టాడు. ఈ సంఘటనపై ఆమె ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్‌ఐ రవి ప్రేమ్‌సాగర్‌రావుపై కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో అల్లుడు ప్రేమ్‌సాగర్‌రావుకు మూడేళ్ల జైలు శిక్ష, రూ. 2వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ప్రవీణ్ తీర్పు ఇచ్చారని సీఐ కృష్ణ తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

చొప్పదండి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి పట్టణానికి చెందిన మాచర్ల నరేష్, శివరామకృష్ణలు వేర్వేరుగా తమ సెల్‌ఫోన్ పోయిందని ఫిర్యాదు చేయగా ఫోన్‌లను పట్టుకుని వారికి అప్పగించినట్లు ఎస్‌ఐ నరేష్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సీఇఐఆర్ పోర్టల్ ఆపరేటర్ శ్రీజను ఎస్‌ఐ అభినందించారు.

బంగారం పేరుతో బురిడీ

- రూ. 22.46 లక్షలతో పరారు
- పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు

హుజూరాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి తన బంగారం బ్యాంకులో తాకట్టు పెట్టానని చెప్పి.. మరో ప్రైవేట్ ఫైనాన్స్ నుంచి డబ్బులు తీసుకొని బురిడీ కొట్టించిన సంఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. సైదాపూర్ మండలం జాగీర్‌పల్లి గ్రామానికి చెందిన కృష్ణ అనే వ్యక్తి ఐదు రోజుల క్రితం హుజూరాబాద్ పట్టణంలోని మణప్పురం గోల్డ్‌లోన్ ఫైనాన్స్‌కు వెళ్లాడు. తన వద్ద ఉన్న 350గ్రాముల బంగారం ఐసీఐసీఐ బ్యాంకులో తాకట్టులో ఉందని చెప్పాడు. తనకు ఎక్కువ మొత్తంలో డబ్బులు కావాలని అడిగాడు. దీంతో ఫైనాన్స్ నిర్వాహకులు లోన్ ఎంత ఉందని అడగగా రూ. 22.46లక్షలు ఉందని కృష్ణ తెలిపారు. దీనికి సదరు ఫైనాన్స్ నిర్వాహకులు కృష్ణ బ్యాంకు ఖాతాకు రూ. 22.46 లక్షలు జమ చేశారు. ఆ తర్వాత మణప్పురం ఫైనాన్స్ నిర్వాహకుడు, కృష్ణలు హుజూరాబాద్‌లోని ఐసీఐసీఐ బ్యాంకు వెళ్లారు. అప్పటికే సాయంత్రం కావడంతో బ్యాంకు సిబ్బంది రేపు రావాలని సూచించారు. మరుసటి రోజు రెండో శనివారం, ఆదివారం కావడంతో బ్యాంకుకు సెలవులు వచ్చాయి. సోమవారం ఫైనాన్స్ నిర్వాహకులు ఐసీఐసీఐ బ్యాంకుకు వెళ్దామని కృష్ణకు ఫోన్ చేయగా వస్తానని చెప్పి పరారయ్యాడు. దీంతో ఫైనాన్స్ నిర్వాహకులు ఐసీఐసీఐ బ్యాంకు వెళ్లి ఆరాతీయగా, అప్పటికే కృష్ణ బ్యాంకు ఖాతా నుంచి నగదు మొత్తాన్ని ట్రాన్స్‌ఫర్ చేశాడు. గమనించిన మణప్పురం ఫైనాన్స్ నిర్వాహకులు హుజూరాబాద్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు.

ఏసీబీకి చిక్కిన ఏఈ, సీనియర్ అసిస్టెంట్

- అద్దె కారు బిల్లు తయారీకి రూ.8 వేల డిమాండ్
- లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు

కరీంనగర్ క్రైం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజనీర్ శరత్, సీనియర్ అసిస్టెంట్ వేణుగోపాల్‌రావు అద్దె కారు యజమాని వద్ద 8 వేల రూపాయలు లంచం తీసుకుంటుండగా మంగళవారం సాయంత్రం కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కరీంగనర్ జిల్లా పరిషత్ కార్యాలయంలోని పంచాయతీరాజ్ శాఖలో విజిలెన్స్, క్వాలిటీ కంట్రోల్ విభాగంలో పనిచేస్తున్న ఏఈ శరత్ కొంతకాలంగా కరీంనగర్‌కు చెందిన రాజు అనేవ్యక్తి కారును అద్దెకు తీసుకున్నాడు. దీనికి ప్రభుత్వం నుంచి బిల్లును చెల్లించాల్సి ఉంది. గత 6 నెలల బిల్లు పెండింగ్‌లో ఉంది. కొద్ది రోజుల కిందట 4 నెలల అద్దెను చెల్లించిన సమయంలోనూ కొంత మొత్తం లంచంగా బాధితుడు చెల్లించాడు. దాదాపు 1.8 లక్షల రూపాయల కారు అద్దె బిల్లును తయారు చేసేందుకు 8 వేల రూపాయలు లంచం ముట్టజెప్పాలని కారు యజమానిని ఏఈ, సీనియర్ అసిస్టెంట్‌లు డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు ఏసీబీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారి సూచనలతో మంగళవారం సాయంత్రం జిల్లాపరిషత్ కార్యాలయంలోని ఏఈ కార్యాలయంలో 8 వేల రూపాయలను సీనియర్ అసిస్టెంట్ వేణుగోపాల్ ద్వారా తీసుకుంటుండగా ఇద్దరిని ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. విచారణ అనంతరం కరీంనగర్ ఏసీబీ స్పెషల్ కోర్టులో హాజరుపరుస్తామని కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్ తెలిపారు. అరెస్టు చేసిన ఇద్దరు ఉద్యోగులను ఏసీబీ కార్యాలయానికి తరలించారు. పట్టుబడిన నగదు, కారు అద్దెబిల్లుకు సంబంధించిన బిల్లు పత్రాలు, ఇతర ఫైళ్లను సీజ్ చేశారు.


ఏసీబీకి పట్టుబడిన ఏఈ శరత్, సీనియర్ అసిస్టెంట్ వేణుగోపాల్

మాజీ ఎంపీటీసీ ఆత్మహత్య

- భూ తగాదాలు, వేధింపులతో పాటు ఆర్థిక ఇబ్బందులు కారణం
- తన చావుకు ఇద్దరు కారణమంటూ సూసైడ్ నోట్

తంగళ్లపల్లి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): భూ తగాదాలు.. రియల్ ఎస్టేట్ వేధింపులు, ఆర్థిక ఇబ్బందులతో మాజీ ఎంపీటీసీ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం అంకుసాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం ప్రకారం.. అంకుసాపూర్ తాజా మాజీ ఎంపీటీసీ కర్కబోయిన కుంటయ్య(48) మంగళవారం తెల్లవారు జామున పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బీఆర్‌ఎస్ నాయకుడైన కుంటయ్య సోమవారం కేటీఆర్‌ను ఏసీబీ ప్రశ్నిస్తుండడంతో మద్దతుగా హైదరాబాద్‌కి వెళ్లి తిరిగిరాలేదు. తెల్లవారు జామున 2 గంటల ప్రాంతంలో తన చావుకు కారణం ఇద్దరు వ్యక్తులు అంటూ సూసైడ్ నోట్ సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. అది చూసిన బంధువులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో రాత్రి పోలీసులను ఆశ్రయించారు. ఫోన్ లోకేషన్ ఆధారంగా గ్రామశివారులోని పొలం వద్ద ఉన్నట్లు గుర్తించారు. పోలీసులు, కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకోగా పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో ఉండడాన్ని గమనించి జిల్లా ఆసుపత్రికి తరలించారు.


కుంటయ్య(ఫైల్)


సూసైడ్ నోట్

పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం ఎల్లారెడ్డిపేటలో ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా మృతిచెందాడు. మృతుడికి భార్య విజయ, ఇద్దరు కూతుళ్ల ఉన్నారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కాగా, సూసైడ్ నోట్‌లో పోలీసులు పట్టించుకోవడం లేదని కుంటయ్య ప్రస్తావించడంపై ఎస్‌ఐని వివరణ కోరగా ఆరు నెలల క్రితం కిష్టారెడ్డి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి కుంటయ్యపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రియల్ ఎస్టేట్ ప్రాణాలు తీసింది

బీఆర్‌ఎస్ పార్టీ నుంచి అంకుసాపూర్ ఎంపీటీసీగా కర్కబోయిన కుంటయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. పార్టీ కార్యక్రమలతో పాటు గ్రామంలో సమస్యల పరిష్కారానికి ముందుగా ఉండేవాడు. మరోవైపు రియల్ ఎస్టేట్ చేస్తున్న క్రమంలో రెండేళ్ల క్రితం తంగళ్లపల్లి మండల కేంద్రంలో ఇంటి స్థలం కొందరికి మధ్యవర్తిగా ఉండి విక్రయించాడు. ఆరు నెలల క్రితం భూమి తగాదాల్లో ఉందని కొనుగోలు చేసిన వారు తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని ఒత్తిడి చేసినట్లు తెలిసింది. చెల్లించాలని ఒత్తిడి పెరగడంతో పాటు మధ్యవర్తిగా ఉండి కమిషన్‌పై విక్రయించగా తిరిగి చెల్లించలేని పరిస్థితి ఉండడం, ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుంటయ్య మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులను బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, నాయకులు బొల్లి రాంమోహన్, మాట్ల మధు తదితరులు పరామర్శించారు.

విధుల నుంచి అన్యాయంగా తొలగించారు

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ఆందోళన


గురుకులం ఎదుట బైఠాయించిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

ఎల్లారెడ్డిపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : పదిహేను ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న తమను అన్యాయంగా తొలగిస్తే పురుగుల మందు తాగి ఇక్కడే చస్తామంటూ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు హెచ్చరించారు. విధుల నుంచి తొలగించడాన్ని నిరసిస్తూ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు మంగళవారం ఎల్లారెడ్డిపేట మండలం దుమాలలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల ఎదుట పురుగుల మందు డబ్బాతో బైఠాయించారు. ప్రధాన ద్వారం ముందు ఆందోళనకు దిగారు. సుమారు రెండు గంటల పాటు నిరసన వ్యక్తం చేశారు. చాలీచాలని వేతనంతో ఔట్ సోర్సింగ్ విధానంలో విధులు నిర్వహించిన తమను అన్యాయంగా తొలగించారని వాపోయారు. న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చినా ఆందోళన కొనసాగించారు. వారికి గిరిజన నాయకులు మద్దతు తెలిపారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్ మంజీద్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన స్పందించలేరు.

ముగ్గురి బైండోవర్

కరీంనగర్ క్రైం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం ఎలబోతారం గ్రామానికి చెందిన బుచ్చాల ఆదిత్య, బుచ్చాల సురేష్, కొర్రి రాజశేఖర్‌ను మంగళవారం కరీంనగర్ రూరల్ తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఎలబోతారంలో రాత్రి సమయాల్లో ముగ్గురు గొడవలు చేస్తూ ప్రజాశాంతికి భంగం కలిగిస్తున్నట్లు అందిన ఫిర్యాదులతో బైండోవర్ చేశామని పేర్కొన్నారు. లక్ష రూపాయల సొంత పూచీకత్తుపై వదిలిపెట్టినట్లు తెలిపారు.

- అక్రమంగా ఇసుకను తరలిస్తున్న కరీంనగర్ రూరల్ మండలం చేగుర్తికి చెందిన చామనపల్లి నరేష్, గాండ్ల సంపత్‌ను మంగళవారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

కరీంనగర్ క్రైం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): కడుపునొప్పితో బాధపడుతూ గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన గాజుల కొండయ్య(65) అనే వృద్ధుడు ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మంగళవారం మృతి చెందినట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. సీఐ వివరాల ప్రకారం.. కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్‌కు చెందిన గాజుల కొండయ్య కొన్ని రోజులుగా తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం గ్రామ శివారులోని ఎస్‌ఆర్‌ఎస్‌పీ కెనాల్ వద్ద గడ్డి మందు తాగాడు. కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందినట్లు సీఐ తెలిపారు.

తప్పుడు సర్వే నంబర్లతో భూ ఆక్రమణకు యత్నం

- ఆరుగురిపై కేసు నమోదు

కరీంనగర్ క్రైం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): తప్పుడు సర్వే నంబర్లతో భూ ఆక్రమణకు యత్నించిన ఆరుగురిపై పోలీ సులు కేసు నమోదు చేశారు. ఫిర్యాదు దారు సామాజిక మాధ్యమాల్లో కేసు వివరాలు పోస్ట్ చేయడంతో ఆలస్యంగా వెలుగు చూసింది. కొత్తపల్లి మండలం రేకుర్తి రెవెన్యూ పరిధిలోని 18వ డివిజన్‌లో సర్వే నంబరు 227లో తన పేరిట ఉన్న భూమిని కొంతమంది తప్పుడు సర్వే నంబర్లతో పత్రాలు సృష్టించి కబ్జా చేయాలని ప్రత్నించినట్లు కరీం నగర్‌కు చెందిన అబూబాకర్ ఫిర్యాదుతో కొత్తపల్లి పోలీసులు ఈ నెల 14న ఆరుగురిపై కేసు నమోదు చేశారు. రేకుర్తి రెవెన్యూ పరిధిలో 230 వరకు మాత్రమే సర్వే నంబర్లు ఉండగా, తాజాగా 231, 232, 233 అనే దొంగ సర్వే నంబర్లను సృష్టించారని, అదే విధంగా 227 సర్వే నంబరులోని 37 గుంటల భూమిని కాజేసేందుకు నందెల్లి మహిపాల్, బండి పల్లి సురేందర్, బండారి మారుతీ, అస్తపురం సాయిలు, అస్తపురం తిరుపతి, అస్తపురం మల్లయ్య పేరిట పత్రాలు సృష్టించారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ విషయమై కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డిని వివరణ కోరగా ఆరుగురిపై కేసు నమోదు చేశామని, విచారణ అనంతరం చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బస్సును వెనుక నుంచి ఢీకొన్న మరో బస్సు

- తప్పిన ప్రమాదం

గంగాధర, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): గంగాధర బస్‌స్టాండ్‌లో ఆర్టీసీ బస్సును వెనక నుంచి మరో ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. స్థానికులు, ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల నుంచి రెండు బస్సులు వరంగల్ వెళ్తున్నాయి. గంగాధర బస్‌స్టాండ్‌లో మూల మలుపువద్ద ఎదురుగా బస్సు రావడంతో ఒక్కసారి డ్రైవర్ బ్రేక్ వేశాడు. దీంతో వెనకాల వస్తున్న మరో బస్సు ముందు బస్సును ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సు అద్దాలు పగలగా ఎవరికీ ప్రమాదం జరగకపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వీణవంక,జూన్17(ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. వీణవంక మండలంలోని కొర్కల్ గ్రామంలోని మానేరు వాగునుంచి ప్రభుత్వం నుంచి ఎటాంటి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న టాక్టర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ఇసుక టాక్టర్ డ్రైవర్ నేదురి రాజ్‌కు మార్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఆవుల తిరుపతి తెలిపారు.

కథలాపూర్ : కథలాపూర్ మండలం బొమ్మెన-తక్కళ్లపల్లి శివారులోని పెద్దవాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మంగళవారం రాత్రి రెవెన్యూ అధికారులతో కలిసి పోలీసులు పట్టుకున్నారు. పట్టుకున్న ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించామని ఎస్సై నవీన్ తెలిపారు.

ప్రజాధనం వృథా చేసిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

గన్నేరువరం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గత ప్రభుత్వ హయాంలో నాసిరకంగా డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని మండల సీపీఐ కార్యదర్శి చొక్కల్ల శ్రీశైలం డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 30 డబుల్ బెడ్‌రూం ఇండ్లు మంజూరు చేసి ప్రారంభించి అందులో కొన్ని పిల్లర్ల లెవల్, కొన్ని స్లాబ్, గోడలు, మెట్లను అసంపూర్తిగా నిర్మించి వదిలేసిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను సీపీఐ నాయకులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డబుల్ బెడ్‌రూంలు నిర్మించిన కాంట్రాక్టర్ నాసిరకంగా మెటీరియల్‌ను వాడడంతోనే మెట్లు కూలిపోయి శిథిలావస్థకు చేరి లక్షల్లో ప్రజాధనం నష్టం వాటిల్లిందని అన్నారు. ప్రజాధనం వృథా చేసిన సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకొని, అసంపూర్తిగా మిగిలిన డబుల్ బెడ్‌రూం ఇండ్లను పూర్తి చేసి నిరుపేదలకు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు కాంతాల అంజిరెడ్డి, మండల నాయకులు కూన మల్లయ్య, పిప్పల్ల కనుకయ్య, అంజనేయులు, కొమురయ్య ఉన్నారు.


డబుల్‌బెడ్ రూం ఇళ్లను పరిశీలిస్తున్న నాయకులు

స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్‌లో దమ్మన్నపేట విద్యార్థుల ప్రతిభ

గంభీరావుపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) మినిస్టరీ ఆఫ్ ఎడ్యుకేషన్ - న్యూఢిల్లీ వారు ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన జాతీయ స్థాయి స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్- 2025 వైజ్ఞానిక ప్రదర్శనల్లో గంభీరావుపేట మండలం దమ్మన్నపేట విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబర్చారు. ఈ వైజ్ఞానిక పోటీ ప్రదర్శనలో దేశ వ్యాప్తంగా ఒక లక్ష ఇరవై వేల మంది విద్యార్థులు పాల్గొనగా, ఆన్‌లైన్ ద్వారా 8 దశల్లో పోటీలు నిర్వహించి అత్యున్నత ప్రతిభ చూపిన 27 ఆవిష్కరణల జాబితాను ఈ నెల 15 ప్రకటించారు. దమ్మన్నపేట పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థినిలు మలోత్ సుప్రియ, ఈరబోయిన శ్రీ చైత్ర ఈరబోయిన మధు ప్రియ గైడ్ టీచర్ తాడూరు సంపత్ కుమార్ మార్గదర్శకంలో తయారు చేసిన స్మార్ట్ వాష్ బేసిన్ అనే ఆవిష్కరణ ఎంపిక చేసిన 27లో ఒకటిగా నిలిచింది. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు చింతపల్లి వెంకటేశ్వరరావును డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ అధికారులు అభినందించారు. విద్యార్థులు గైడ్ టీచర్‌తో కలిసి జులై 29న ప్రధానమంత్రి మోదీ ఆధ్వర్యంలో ఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో నిర్వహించనున్న కార్యక్రమంలో వారు తమ ఇన్నోవేషన్‌ను ప్రదర్శించనున్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఏకగ్రీవం దిశగా ముల్కనూర్ సహకార బ్యాంకు ఎన్నికలు

ప్రవీణ్‌రెడ్డి ప్యానల్ ఏకగ్రీవం అయ్యే అవకాశం

భీమదేవరపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ముల్కనూర్ సహకార బ్యాంకు ఎన్నికల్లో ప్రవీణ్‌రెడ్డి ప్యానల్ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికై అవకాశాలు కనబడుతున్నాయి. మొత్తం ముల్కనూర్ సహకార బ్యాంకులో 5 డైరెక్టర్ స్థానాలకు గాను 11 మంది నామినేషన్లు దాఖలు చేశారు. 1వ డైరెక్టర్ స్థానానికి ప్రస్తుత బ్యాంకు అధ్యక్షుడు అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, దొంగల చిన్న వెంకట్రాజం, 2వ డైరెక్టర్ స్థానానికి బొల్లంపల్లి కుమారస్వామి, కడారి ఆదామ్, 5వ డైరెక్టర్ స్థానానికి గణవేని శ్రీనివాస్, కూన కనకయ్య, 9వ డైరెక్టర్ స్థానానికి గుర్రాల భాస్కర్‌రెడ్డి, మార్పాటి జైపాల్‌రెడ్డి, బోయినపల్లి రత్నాకర్‌రావు, 15వ డైరెక్టర్ స్థానానికి కాశిరెడ్డి వసంత, కంకల భాగ్యలు నామినేషన్లు దాఖలు చేశారు. మంగళవారం నామినేషన్లు పరిశీలించగా అన్ని నామినేషన్లు సక్రమంగా ఉన్నట్లు ఎన్నికలాధికారి కోదండరాములు తెలిపారు. కాగా, బుధవారం నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని ఎన్నికలాధికారి తెలిపారు. 11 నామినేషన్లలో 10 నామినేషన్లు ప్రవీణ్‌రెడ్డి ప్యానల్‌కు చెందిన అభ్యర్థులు వేశారు.బుధవారం నామినేషన్ల ఉపసంహరణ కార్యక్రమం ఉంటుంది. ఇందులో 11 నామినేషన్లకు ఆరుగురు అభ్యర్థులు నామినేషన్లు ఉపసంహరించుకుండగా, ప్రవీణ్‌రెడ్డి ప్యానల్‌కు చెందిన ఐదుగురు డైరెక్టర్లు ఏకగ్రీవం అయ్యే అవకాశం ఉంది.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి యువకుడి మృతి

కథలాపూర్/చందుర్తి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనం అదుపు తప్పి చందుర్తి మండలం కట్టలింగంపేటకు చెందిన హరీశ్(28) అనే యువకుడు మంగళవారం మృతిచెందాడు. ఎస్సై నవీన్ కథనం ప్రకారం హరీశ్ ద్విచక్ర వాహనంపై అత్తగారింటికి కథలాపూర్‌కు మంగళవారం రాత్రి బైక్‌పై అతివేగంగా వెళ్తున్నాడు. మండలంలోని కలికోట శివారులోని పెద్దమ్మ గుడి వద్ద బైక్ అదుపు తప్పి కింద పడడంతో తలకు తీవ్ర గాయాలైన హరీశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య సుప్రజ గర్భవతిగా కాగా, తల్లిదండ్రులు దేవయ్య, అమ్మాయి ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

అంగన్‌వాడీ టీచర్‌పై దాడి

మల్యాల, జూన్ 17(ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం రాంపూర్‌లో అంగన్‌వాడీ టీచర్‌పై అదే గ్రామానికి చెందిన ఓ యువకుడు మంగళవారం స్క్రూడ్రైవర్‌తో దాడి చేయడంతో గాయాలయ్యాయి. మల్యాల ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద నిత్యం కొందరు మద్యం సీసాలు, సిగరెట్లు తాగుతూ వాటిని అక్కడే పడేయడంతో అంగన్‌వాడీ టీచర్ బద్దం లక్ష్మి పలు మార్లు గ్రామస్థుల దృష్టికి తీసుకెళ్లింది. తనకు చెడు అలవాట్లు ఉన్నాయని గ్రామస్థులకు టీచర్ చెబుతున్నట్లు ఎలేటి ఆదర్శ్ అనే యువకుడు లక్ష్మితో పలుమార్లు గొడవ పడ్డాడు. మంగళవారం స్క్రూడ్రైవర్‌తో అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చి దాడికి పాల్పడగా గాయాలయ్యాయి. దీంతో అంగన్‌వాడీ టీచర్ కూతురు నిహారిక ఫిర్యాదు మేరకు ఆదర్శ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వేములవాడలో కొనసాగుతున్న కూల్చివేతలు

- పనులు పరిశీలించిన జిల్లా ఎస్పీ



శిథిలాలను తొలగిస్తున్న యంత్రాలు

వేములవాడ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని ప్రధాన రహదారి విస్తరణలో భాగంగా చేపట్టిన ఇళ్లు, భవనాల కూల్చివేత పనులు మూడో రోజు కొనసాగాయి. మూలవాగు వంతెన నుంచి రాజన్న ఆలయం వరకు 80 అడుగుల మేరకు రోడ్లను విస్తరించనుండగా, ఇందులో 243 మందికి చెందిన ఇళ్లు, భవనాలు తొలగించాలని నిర్ణయించారు. ఈ మేరకు ప్రస్తుతానికి కోర్టులో ఉన్న 88 నిర్మాణాలను మినహాయించి మిగతా వాటిని అధికారులు జెసిబిలు ప్రోక్లైన్‌ల సహాయంతో తొలగిస్తున్నారు. ఈ క్రమంలో మూడవ రోజు అయిన మంగళవారం నాడు నిర్మాణాలను తొలగిస్తూ, వాటి శిథిలాలతో ప్రజలకు ఇబ్బంది ఎదురు కాకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నారు. పదికి పైగా యంత్రాలతో ఎక్కడికక్కడ భవనాలు ఇల్లు తొలగిస్తుండడంతో దుమ్ము చెలరేగి పరిసర ప్రాంతాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

జిల్లా ఎస్పీ మహేష్ బి గీతే, అదనపు ఎస్పీ చంద్రయ్యతో కలిసి మంగళవారం కూల్చివేత పనులను పరిశీలించారు. పట్టణ సీఐ వీర ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ అన్వేష్‌ను అడిగి కూల్చివేతకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇండ్ల తొలగింపు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన స్థానిక అధికారులకు సూచించారు.



పనులు పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ మహేష్ బి గీతే

గీతన్నల రక్షణ కవచం 'కాటమయ్య కిట్లు'

- జిల్లాకు ఏడాదిలో 1,700 కిట్లు మంజూరు
- ఇప్పటికే 1,961 మందికి శిక్షణ పూర్తి
- ఈ నెలలో మరో 700 గీత కార్మికులకు శిక్షణ





కరీంనగర్ క్రైం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కులవృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్న గీత వృత్తిదారులైన గౌడన్నలను ప్రమాదాల నుంచి రక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కాటమయ్య రక్షణ కవచాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నది. తాటి చెట్టు, ఈత చెట్టుపైన మోకు జారి ప్రమాదాలకు గురవుతూ గీత కార్మికులు పెద్ద ఎత్తున ప్రాణాలు కోల్పోతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కులవృత్తినే నమ్ముకుని జీవనం సాగిస్తున్న గీత కార్మికులు ఈత, తాటి చెట్లపై నుంచి మోకు జారి కిందపడుతున్నారు. మరి కొందరు చెట్టుపైనే తలకిందులుగా వేలాడుతున్నారు. ఈ సంఘటనల్లో చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారు. మరి కొందరు తీవ్ర గాయపడి జీవచ్ఛవాల్లా రోజులు వెళ్లదీస్తున్నారు. దీంతో ఆయా కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకుంటున్నాయి. ఇటువంటి సందర్భాల్లో గీత కార్మికులకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయాన్ని అందించి ఆదుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఎక్సైజ్ శాఖ ద్వారా గీత వృత్తిలో ప్రమాదాలకు గురైన గీత కార్మికులకు ఎక్స్‌గ్రేషియాను అందిస్తున్నది. ఈ పథకం కింద లబ్ధిదారుల ఎంపిక, ఆర్థిక సహాయం అందుకోవటానికి తీవ్ర జాప్యం జరుగుతున్నది. ఈత, తాటి చెట్లు ఎక్కి కల్లును గీసే సమయంలో ప్రమాదాలబారిన పడకుండా గీత కార్మికులను రక్షించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం 2024లో 'కాటమయ్య రక్షణ కవచ' కిట్లను (సేఫ్టీమోకు) తీసుకువచ్చింది. ఈ సేఫ్టీ మోకులు గీత కార్మికులకు రక్షణ కవచంలా పని చేస్తున్నాయి.

త్వరలో మూడో విడత కిట్ల పంపిణీ

కరీంనగర్ జిల్లాకు మొదటి విడతలో వెయ్యి, రెండో విడతలో 700 కాటమయ్య రక్షణ కవచం యూనిట్లు మంజూరు అయ్యాయి. ఈ నెలలో మూడో విడతగా మరో 700 కిట్లు ఈ నెలాఖరులోగా మంజూరు అవుతాయని అధికారులు తెలిపారు. నియోజకవర్గాలవారీగా గీతకార్మిక సంఘాలు ఎంపిక చేసిన కార్మికులకు ప్రాధాన్యక్రమంలో కిట్లను అందజేస్తారు. బీసీ సంక్షేమశాఖ, ఎక్సైజ్ శాఖలు సంయుక్తంగా గీతకార్మికుల ఎంపిక, శిక్షణ, కిట్ల పంపిణీ చేపట్టాయి. రెండు శాఖల ఆధ్వర్యంలో కాటమయ్య రక్షణ కవచం వినియోగంపై జిల్లావ్యాప్తంగా గీత కార్మికులకు శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 1,961 మంది గీతకార్మికులకు శిక్షణ పూర్తి చేశారు. శిక్షణ పూర్తిచేసుకున్న గీత కార్మికుల్లో రెండు విడతల్లో కలిపి 1,624 మందికి కిట్లను అందజేశారు. గీత కార్మికులకు ఈ నెలలో శిక్షణ పూర్తిచేసి కిట్లును వారికి అందజేస్తామని బీసీ సంక్షేమశాఖ అధికారి అనిల్ ప్రకాశ్ తెలిపారు.

గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు

ఎక్సైజ్‌శాఖ, బీసీ సంక్షేమశాఖ అధికారులు సంయుక్తంగా గీతకార్మికులకు గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కాటమయ్య రక్షణ కవచాన్ని ఏ విధంగా ఉపయోగించాలి? ఏ విధంగా రక్షణ ఉంటుంది? అనే అంశాలపై శిక్షకులు గీతకార్మికులకు అవగాహన కల్పిస్తూ, తాటి చెట్లపైకి ఎక్కిస్తూ ప్రాక్టికల్‌గా శిక్షణ అందిస్తున్నారు.

బహ్రెయిన్‌లో అరెస్టు అయిన జిల్లా వాసులకు సహకారాలు అందించాలి



వినతిపత్రం అందిస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

జగిత్యాల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): బహ్రెయిన్‌లోని ఆల్ మోయ్యాద్ కంపెనీలో డ్రైవర్లుగా పనిచేస్తున్న పలువురు తెలంగాణ వాసులను ఇంధనం దుర్వినియోగం కేసులో అక్కడి పాలకులు అరెస్టు చేశారని, భారత ప్రభుత్వం సహకారం అందించి విడిపించాలని కోరుతూ హైద్రాబాద్‌లో ఎన్ఆర్ఐ అడ్వయిజరీ కమిటీ వైస్ చైర్మన్ మంద భీంరెడ్డికి బాధిత కుటుంబ సభ్యులు వినతిపత్రం అందించారు. జిల్లాలోని ధర్మపురి మండలం నేరెళ్లకు చెందిన డ్రైవర్ బొమ్మిడి సుదర్శన్‌తో పాటు మరో ఎనిమిది మంది ఈ కేసులో ఈనెల 4వ తేదీన అరెస్టు అయ్యారని, వారికి న్యాయ సహాయం అందించాలని, జైలు నుంచి విడిపించాలని కోరుతూ ఆయన కుమారుడు నితిన్ హైద్రాబాద్ ప్రజా భవన్‌లోని ప్రవాసీ ప్రజావాణిలో, ఎన్ఆర్ఐ అడ్వయిజరీ కమిటీకి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఐ అడ్వయిజరీ కమిటీ వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి, సభ్యులు సింగిరెడ్డి నరేశ్ రెడ్డి, గుగ్గిల్ల రవి గౌడ్, నంగి దేవేందర్ రెడ్డి, బొజ్జ అమరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాటి చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి గాయాలు



గాయపడ్డ మల్లేశం గౌడ్

రుద్రంగి జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రుద్రంగి మండల కేంద్రానికి చెందిన గీత కార్మికుడు మల్యాల మల్లేశం గౌడ్ మంగళవారం సాయంత్రం ప్రమాదవశాత్తూ తాటి చెట్టు పైనుంచి జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. మల్లేశం కుటంబ పోషణ నిమిత్తం వృత్తిపని తాటి చెట్లను ఎక్కుతున్నాడు. రోజూ మాదిరి గానే తాటి చెట్టు ఎక్కుతున్న సమ యంలో ప్రమాదవశాత్తు కిందపడగా తీవ్ర గాయాలయ్యాయి. అక్కడే ఉన్న వారు గమనించి మల్లేశంను ఆసుపత్రికి తరలించారు.

విద్యుత్ వైర్లు తెగి పడి మూడు గేదెలు మృతి

రాయికల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇటిక్యాల గ్రామంలోని బ్రిడ్జి సమీపంలో విద్యుత్ వైర్లు తెగి మూడు గేదెలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన పాడి రైతులు దండవేణి అంతయ్య, మారను గంగారాం, గడికొప్పుల మల్లేశం గేదెలు మృతి చెందడంతో వారు కన్నీరుమున్నీరవుతున్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి తగినంత సహాయం అందించాలని బాధితులు కోరుతున్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారికి జరిమానా

మానకొండూర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఏడుగురు ఇసుక ట్రాక్టర్ల యజమానులకు ఒక్కొక్కరికి కోర్టు రూ. 8వేల జరిమానా విధించినట్లు స్థానిక సీఐ సంజీవ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. స్పెషల్ జ్యూడిషియల్ ఎక్సయిజ్ మెజిస్ట్రేట్ ఒక్కొక్క ట్రాక్టర్ యజమానికి రూ. 8 వేల జరిమానాతో పాటు స్థానిక పీహెచ్‌సీలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించినట్లు తెలిపారు.

బసంత్‌నగర్‌లో నాలుగు ఉమ్మడి జిల్లాల స్థాయి వాలీబాల్ పోటీలు



రాష్ట్ర అధ్యక్షుడిని ఆహ్వానిస్తున్న జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్, తిరుపతి

సుల్తానాబాద్, జూన్ 17: (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు బసంత్‌నగర్‌లో ఈ నెల 19, 20, 21 తేదీలలో నిర్వహిస్తున్నట్లు పెద్దపల్లి జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్, స్పోర్ట్స్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి అమిరిశెట్టి తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో బసంత్‌నగర్‌లో నిర్వహిస్తున్న ఇన్విటేషనల్ వాలీబాల్ టోర్నమెంట్స్‌లో కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, వరంగల్ ఉమ్మడి జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొంటాలని వారు పేర్కొన్నారు. రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్‌బాబును మంగళవారం సన్మానించి పోటీలకు ఆహ్వానించినట్లు తెలిపారు.

మహిళాశక్తి చీరలతో నేతన్నకు చేతినిండా ఉపాధి

- ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



సిరిసిల్లలో చీరల ఉత్పత్తిని పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, శైలజ రామయ్యార్

సిరిసిల్ల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ నేత కార్మికులకు ఇందిరా మహిళా శక్తి చీరల ఉత్పత్తితో చేతినిండా పని కల్పిస్తున్నామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం సిరిసిల్లలో మరమగ్గాల యూనిట్లను చేనేత జౌళి, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కలిసి చీరల ఉత్పత్తి ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు కార్మికులతో మాట్లాడారు. ప్రతిరోజు ఎన్ని మీటర్ల చీర ఉత్పత్తి చేస్తున్నారు.. వారానికి ఎంత ఆదాయం వస్తుందనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. చీరల ఉత్పత్తిలో ఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా అని ఆరా తీశారు. తమకు ప్రతివారం రూ4 వేల నుంచి రూ 5వేల వరకు ఆదాయం వస్తోందని కార్మికులు వారి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాటాడుతూ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి, కార్మికులను ఆదుకునేందుకు చేతినిండా పని కల్పించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారని వివరించారు. ఇందులో భాగంగా సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు ఇందిరా మహిళా శక్తి కింద చీరల ఉత్పత్తి ఆర్డర్లు అందించామని తెలిపారు. కార్మికులు, ఆసాములు కోరిన విధంగా ధర నిర్ణయించామని వెల్లడించారు. ఇందిరా మహిళా శక్తి చీరలతో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలోని కార్మికులు, ఆసాములకు దాదాపు ఎనిమిది నెలల పాటు ఉపాధి లభిస్తుందని తెలిపారు. గతంలోని బతుకమ్మ చీరల బకాయిలు దాదాపు రూ.280 కోట్లు ప్రభుత్వం చెల్లించిందని గుర్తు చేశారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ అభివృద్ధిలో భాగంగా దశాబ్దాల కల నెరవేరుస్తూ వేములవాడలో రూ 50 కోట్లతో యార్న్ బ్యాంకు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు అవసరమైన యార్న్ అంతా అక్కడ అందుబాటులో పెడుతున్నామని తెలిపారు. ఇతర ప్రభుత్వ శాఖ ఆర్డర్లు సిరిసిల్లకు కేటాయిస్తున్నామని పేర్కొన్నారు. సెస్ పరిధిలోని బ్యాక్ బిల్లింగ్ సమస్య కోర్టు పరిధిలో ఉందని దానిపై త్వరలో ముఖ్యమంత్రి, ఇతర మంత్రులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని భరోసా ఇచ్చారు. చేనేత జౌళి, దేవాదాయ శాఖ కార్యదర్శి శైలజ రామయ్యార్ మాట్లాడుతూ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు అవసరమైన ఆర్డర్లన్నీ ప్రభుత్వం తరఫున అందజేస్తున్నామని తెలిపారు. కార్మికులకు ప్రతివారం రూ.4 వేల నుంచి రూ.5వేల వరకు ఆదాయం వస్తుందని తెలిపారు. ప్రభుత్వం నుంచి ఇందిరా మహిళల శక్తి చీరల ఆర్డర్ పొందిన వారు మొదటి చీర ఉత్పత్తిని త్వరగా పూర్తిచేసి అందజేయాలని సూచించారు. రెండో చీర ఆర్డర్‌కు సిద్ధం కావాలని పేర్కొన్నారు కార్యక్రమంలో సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ స్వరూపరెడ్డి, చేనేత, జౌళి శాఖ జేడీ ఎస్ వెంకటేశ్వర్లు, ఏడీ రాఘవరావు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, కాంగ్రెస్ నాయకులు గడ్డం నర్సయ్య, సంగీతం శ్రీనివాస్, వైద్యశివప్రసాద్, ఆడెపు చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

బద్దిపోచమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు



బద్దిపోచమ్మ ఆలయం వద్ద భక్తులు



అంజన్న ఆలయ ఆవరణలో భక్తులు

వేములవాడ కల్చరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి అనుబంధ ఆలయమైన బద్దిపోచమ్మ ఆలయానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. సోమవారం రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్న భక్తులు అమ్మవారికి ఎంతో ఇష్టమైన మంగళవారం ఉదయాన్నే మట్టి పాత్రల్లో అమ్మవారికి నైవేద్యం వండుకుని డప్పుచప్పుళ్ల మధ్య శివసత్తుల నృత్యాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. నెత్తిన బోనాలతో భక్తులు అమ్మవారి దర్శనం కోసం సుమారు నాలుగు గంటలపాటు నిరీక్షించారు. ఆలయంలోకి చేరుకున్న భక్తులు ముందుగా పట్నం వేసి నూతన వస్త్రాలు సమర్పించి అమ్మవారిని దర్శించుకున్నారు.

కొండగట్టులో రద్దీ

మల్యాల: కొండగట్టు ఆంజనేయస్వామి క్షేత్రం మంగళవారం భక్తులతో రద్దీగా మారింది. మంగళవారం వేకువ జాము నుంచే వేలాదిగా తరలివచ్చిన వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు. అంజన్న దర్శనంకు వచ్చిన కరీంనగర్‌కు చెందిన డాక్టర్ సాహిల్‌రావు తన సెల్‌ఫోన్ పోగొట్టుకోగా పోలీస్ అవుట్‌పోస్ట్ ఏఎస్సై చిలుక శ్రీనివాస్ అప్పగించారు. అప్పగించిన ఫోన్ విలువ లక్ష వరకు ఉంటుందని భక్తుడు తెలిపాడు.

ప్రమాదకరంగా కాలువ వంతెనలు

- ఇబ్బందులు పడుతున్న రైతులు, ప్రజలు



డీ86 కాలువపై శిథిలావస్థలో ఉన్న వంతెన

చొప్పదండి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కాకతీయ కాలువపై నలభై ఏళ్ల క్రితం నిర్మించిన వంతెనలు శిథిలావస్థకు చేరుకున్నాయి. 1980కి ముందు కాకతీయ కాలువ నిర్మాణ సమయంలో ఏర్పాటు చేసిన వంతెనలు ప్రమాదకరంగా మారాయి. అప్పటి జనాభా, పరిస్థితులకు అనుగుణంగా వంతెనలను నిర్మించారు. అవి ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా లేవు. దీంతో ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. చొప్పదండి పట్టణ శివారులోని డీ86 కాలువపై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరింది. ఈ వంతెనపై నుంచి ప్రతి రోజు పదుల సంఖ్యలో భారీ వాహనాలు రైస్ మిల్లులకు వెళుతుంటాయి. ఏడేళ్ల గడుస్తున్నా ఈ వంతెనకు మరమ్మతులు చేయడం లేదు. గతంలో ఈ వంతెనకు మరమ్మతులు చేపట్టి బాగు చేయాలని రాష్ట్ర భారీ నీటి పారుదల మంత్రికి వినతిపత్రాన్ని సమర్పించినా ఫలితం లేదు.

కార్ట్ బ్రిడ్జితో ఇబ్బందులు...

చిట్యాలపల్లి పరిధిలోని కాకతీయ ప్రధాన కాలువపై నుంచి రైతులు పొలాల వద్దకు పోయేందుకు నిర్మించిన కార్ట్ బ్రిడ్జి (ఎడ్ల బండ్ల వంతెన) వంతెన శిథాలావస్థకు చేరింది. 1980 ప్రాంతంలో ఎడ్ల బండ్లు పోయేందుకు వీలుగా వంతెన నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం ఎడ్ల బండ్లు కనుమరుగయ్యాయి. రైతులు వ్యవసాయానికి ఉపయోగిస్తున్న ట్రాక్టర్లు, హార్వెస్టర్లు పోవడానికి వీలులేకుండా ఈ బ్రిడ్జి నిరుపయోగంగా మారింది. గ్రామం నుంచి పొలాలకు వెళ్లాలంటే రైతులు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న రెవెల్లి వద్ద బ్రిడ్జి దాటాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం కాలువ నీటి ప్రవాహం లేనందున బ్రిడ్జికి మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు.



ఇరుకుగా ఉన్న వంతెన

ఇందిరమ్మ ఇళ్లకు తప్పిన ఇసుక ఇబ్బందులు

టోకెన్ల ద్వారా ఉచితంగా అందజేయనున్న అధికారులు



గన్నేరువరం గ్రామపంచాయితీ ఆవరణలో నిర్మించిన ఇందిరమ్మ మోడల్ ఇల్లు

గన్నేరువరం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): అర్హులైన నిరుపేదలకు సొంతింటి కల నెరవేరేలా రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి విడతల వారీగా ఎనిమిది ట్రిప్పుల ఇసుకకు టోకెన్లను అధికారులు అందజేయనున్నారు. మండలంలోని 17 గ్రామాల్లో మొదటి విడతలో 307 మందికి అధికారులు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ అందజేశారు. ప్రొసీడింగ్స్ పొందిన లబ్ధిదారులు 20 రోజుల్లోగా ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించాలని అధికారులు తెలిపారు. లేకుంటే వాటిని రద్దు చేసి వేరొకరికి ఇవ్వనున్నట్లు అధికారులు తెలపడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం సూచించిన కొలతల ప్రకారం హౌసింగ్ ఏఈ, గ్రామ పంచాయతీ కార్యదర్శుల సమక్షంలోనే ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గు పోసి పనులను ప్రారంభిస్తున్నారు. ఇళ్ల నిర్మాణానికి ఇసుక దొరకడం లబ్ధిదారులకు ఇబ్బందిగా మారడంతో నిర్మాణ పనులు ఆలస్యం అవుతున్నాయి. అధికారుల నుండి స్పష్టమైన ఆదేశాలు లేకపోవడంతో ఇసుకకు డీడీలు కట్టాలా వద్దా అని, కడితే ఎన్ని ట్రిప్పులకు అనుమతులు ఇస్తారన్న అనుమానాలతో గందరగోళానికి గురయ్యారు. ఈ నేపథ్యంలో లబ్ధిదారులకు ఇసుకను ఉచితంగా టోకెన్ల ద్వారా అందిస్తామని అధికారులు తెలపడంతో వారికి ఊరట లభించింది.

ఇందిరమ్మ ఇళ్లకు ఎనిమిది ట్రిప్పుల ఇసుక ఉచితం

- ఎంపీడీవో శ్రీనివాస్, గన్నేరువరం



ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఇసుకకు ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదు. ప్రతి ఇంటికి టోకెన్ల ద్వారా ఎనిమిది ట్రిప్పుల ఇసుకను ఉచితంగా ప్రభుత్వమే అందించనుంది. ఇసుక తరలింపునకు ట్రాక్టర్‌కు అయ్యే ఖర్చును మాత్రమే లబ్ధిదారు చెల్లించాలి. ఇంటి నిర్మాణానికి ముగ్గు పోసుకుని సంబంధిత ఇంటి మెటీరియల్ లబ్ధిదారు సమకూర్చుకున్నాక హౌసింగ్ ఏఈ, ఆయా గ్రామపంచాయతీ కార్యదర్శి పరిశీలించి ఇసుకకు టోకెన్లను జారీ చేస్తారు.

తహసీల్దార్‌కు సన్మానం

కోరుట్ల రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన కృష్ణ చైతన్యను మండల బీఆర్ఎస్ నాయకులు, మాజీ సర్పంచ్‌లు మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, కల్లూర్ మాజీ సర్పంచ్ వనత డుపు అంజయ్య, నాయకులు రాజనర్సయ్య, ముత్తయ్య, గోపాల్‌లు కలిసి శాలువాతో సత్కరించారు. ఈసందర్భంగా మండలంలోని రెవెన్యూ సమస్యలను తహసీల్దార్‌కు వివరించారు.

పాఠశాలకు కంప్యూటర్ వితరణ

రాయికల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లీపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పాఠశాలలో పని చేసి 2004లో రిటైర్ అయిన ఉపాధ్యాయుడు దివంగత కాసం మురళి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు కాసం శ్రీనివాస్ లయన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ సికింద్రాబాద్ ప్యారడైజ్ ఆధ్వర్యంలో కంప్యూటర్‌ను మంగళవారం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ప్యారడైజ్ అధ్యక్షుడు గణేష్, మాజీ ఎంపీటీసీ మోర విజయలక్ష్మి, ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు గుర్రం శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

బీర్‌పూర్,జూన్ 17(ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండలంలోని తాళ్ళధర్మారం గ్రామంలో మంగళవారం ధర్మపురి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుముల లావణ్య ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి సునీల్ గ్రామంలోని వివద రకాల 200 పశువులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సంగ నర్సింహులు, పాలకవర్గ సభ్యులు ఏనుగు జోగిరెడ్డి, రామడుగు రవి, గంధం రాజయ్య, ఎండీ రఫీయోద్దీన్, వెటర్నరీ సిబ్బంది, మాజీ సర్పంచ్ మహిపాల్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ నారపాక రమ రమేష్, కొల్వాయి సింగిలివిండో చైర్మన్ నవీన్ రావ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సమస్య పరిష్కరించాలి

మల్లాపూర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : మల్లాపూర్ మండల కేంద్రంలోని ప్రధాన మురికి కాలువ నీరు ఎస్సీ కాలనీ నుండే వెళ్తుండడంతో రోగాల బారిన పడుతున్నామని మంగళవారం గ్రామ పంచాయతీ కార్యదర్శికి కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని ఎస్సీ కాలనీలోని డ్రైనేజీ శిథిలావస్థలో ఉండి మురికి నీరు రోడ్డుపైకి రావడంతో దోమలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు డ్రైనేజీ మరమ్మతులు చేసి సమస్యను పరిష్కరించాలని కోరారు.

రైతు భరోసా నిధులు విడుదల

ధర్మపురి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని నాలుగు రైతు క్లస్టర్‌ల పరిధిలో గల గ్రామాలకు చెందిన రైతులకు రైతు భరోసా డబ్బులు జయ చేసినట్లు మండల వ్యవసాయాధికారి రాజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ధర్మపురి క్లస్టర్ పరిధిలో 4,281 మంది రైతులకు రూ.2,41,17,413, జైనా క్లస్టర్ పరిధిలో గల 2,613 మంది రైతులకు రూ.1,96,56,023 జమ చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. రాయపట్నం క్లస్టర్ పరిధిలో గల 3146 మంది రైతులకు రూ.2,00,16,394, తిమ్మాపూర్ క్లస్టర్ పరిధిలో గల 2882 మంది రైతులకు రూ.1,78,43,743 జమ చేయడం జరిగిందని ఆయన వివరించారు. ధర్మపురి మండలంలో మొత్తం 12,922 మంది రైతులకు రూ.8,16,33,703 జమ చేసినట్లు ఆయన తెలిపారు.

●**మల్యాల:** రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసా ద్వారా మంగళవారం నాటికి మండలంలోని 8488 మంది రైతులకు రూ.5,70,63,793 రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు మండల వ్యవసాయ అధికారి కె.చంద్రదీపక్ తెలిపారు. జూన్ 5లోపు పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన మండల రైతులు రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కోరారు. తమ దరఖాస్తులను ఈనెల 19లోపు వ్యవసాయ కార్యాలయంలో అందించి రైతు భరోసా పొందాలని సూచించారు.


మల్యాలలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

●రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమచేయడం పట్ల మల్యాలలోని సోనియా గుడి వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చిత్రపటంకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రైతుల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆనందరెడ్డి, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, ఆదిరెడ్డి, శనిగారపు తిరుపతి, లక్ష్మారెడ్డి, లక్ష్మణాచారి, నేరెళ్ల సతీష్‌రెడ్డి, మర్రి లక్ష్మన్, ఇమామ్, ప్రతాప్, వంశీధర్, గుర్రం వెంకన్న, రమణ, బండి రవి, మురళీ పాల్గొన్నారు.

●**భీమారం:** భీమారం మండలానికి క్లస్టర్‌లవారీగా నిధులు విడుదలైనట్లు మండల వ్యవసాయాధికారి తెలిపారు. గోవిందారం క్లస్టర్ పరిధిలోని 1902 మంది రైతులకు రూ.1,59,17,718లు, మన్నెగూడెం క్లస్టర్ పరిధిలోని 821 మంది రైతులకు రూ.62,20,770లు, వెంకట్రావుపేట క్లస్టర్ పరిధిలోని 1337 మంది రైతులకు రూ.1,00,35,732ల నిధులు విడుదలైనట్లు వారు పేర్కొన్నారు.

●**కొడిమ్యాల:** రైతు భరోసాను మంగళవారం నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఎకరాకు ఆరువేల రూపాయల చొప్పన రైతుల ఖాతాల్లో జమ చేసిందని మండల వ్యవసాయ అధికారి పి. జ్యోతి తెలిపారు. మంగళవారం ఏవో విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని 9463 మంది రైతులకు 6,76,12,554 రూపాయలు రైతుల ఖాతాలోకి చేరినట్లు ఏవో తెలిపారు. మండలంలోని కొడిమ్యాల క్లస్టర్‌లో 2779 మంది రైతులకు 1,94,07,823 రూపాయలు, నల్లగొండ క్లసర్‌లో 1763మంది రైతులకు 1,27,17,475 రూపాయలు, పూడూర్ క్లస్టర్‌లో 2379మంది రైతులకు 1,58,78,311 రూపాయలు, తిర్మలాపూర్ క్లస్టర్‌లో 2542మంది రైతులకు 1కోటీ 96లక్షల 8వేల 945రూపాయలు రైతు భరోసా పథకం కింద రైతులకు జమ అయినట్లు ఏవో తెలిపారు.

●**వెల్గటూర్:** మండలంలోని 7920 మంది రైతులకు రూ.5,04,05,773లు రైతు భరోసా డబ్బులు రైతుల ఖాతాల్లో జమ అయినట్లు మండల వ్యవసాయాధికారి సాయికిరణ్ తెలిపారు. వెల్గటూర్ క్లస్టర్‌లో 4582 రైతులకు గాను రూ.2,77,90,527లు, చెగ్యాం క్లస్టర్‌లో 3339 మంది రైతులకు గాను రూ.2,26,15,246లు రైతుల ఖాతాల్లో జమ అయినట్లు పేర్కొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ

మెట్‌పల్లిటౌన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు అన్నారు. మంగళవారం పట్టణంలోని 7వ వార్డులో పలువురు లబ్దిదారులకు మంజూరైన ఇందిర్మ ఇళ్ల నిర్మాణంకు ఆయన భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి పేదకుటుంబంకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు జెట్టి లింగం, తిప్పిరెడ్డి అంజిరెడ్డి, జాకీర్, ఖయ్యుం, శంకర్ పాల్గొన్నారు.

●కథలాపూర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని కలికోట, రాజారాం తండా గ్రామాల్లో మంగళవారం ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాలకు మహిళలు, కాంగ్రెస్ నాయకులు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అంబటి రాధాకృష్ణ, ఏఎంసీ డైరెక్టర్ తిరుపతి, మహిళలు, యువకులు ఉన్నారు.

●మల్లాపూర్ : మండలంలోని కుస్తాపూర్, రత్నాపూర్ గ్రామాల్లో లబ్ధిదారులు నిర్మించు కుంటున్న ఇందిరమ్మ ఇండ్ల పనులకు మంగళవారం కాంగ్రెస్ నాయకులు శంకుస్థాపన చేస్తున్నారు. ఇంటి నిర్మాణం కోసం ముగ్గు పోసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ఇంటి నిర్మాణం త్వరగా పూర్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటీసీ, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి, మాజీ ఎంపీపీ నల్ల రాజన్న, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, షైపాల్, రవి, నర్సయ్య, మల్లయ్య, రాజేందర్ పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


చెక్కులను పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి నర్సింగరావు

మెట్‌పల్లిటౌన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి):అభివృద్ధి సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని కోరుట్ల కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగ రావు అన్నారు. మంగళవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యలయంలో మెట్‌పల్లి పట్టణ, మండలంకు సంబంధించిన పలువురు లబ్దిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను ఆయన అందజేశారు. పట్టణ, మండలంకు చెందిన 36 మంది లబ్దిదారులకు 14 లక్షల 26 వేల విలువ గల చెక్కులను ఆయన అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు జెట్టి లింగం, తిప్పిరెడ్డి అంజిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మహేంధర్‌రెడ్డి, పాల్గొన్నారు.

●ఇబ్రహీంపట్నం: మండలంలోని వర్షకొండ గ్రామంలో రైతువేదికలో పలువురు లబ్దిదారులు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపీణి చేశారు. 30 మందికి 10,37,500 లక్షల రూపాయల విలువ గల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల్ అధ్యక్షులు గూడ శ్రీకాంత్ రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కంతి మోహన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చేర్మెన్ బోరిగాం రాజు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణకు చర్యలు తీసుకోవాలి

కొడిమ్యాల, జూన్17(ఆంధ్రజ్యోతి) : వర్షాకాలం ప్రారంభమైనందున పారిశుధ్య నిర్వహణపై ముందస్తు చర్యలు తీసుకునేలా కార్యదర్శులకు ఆదేశాలు ఇవ్వాలని కలెక్టర్‌కు మంగళవారం వినతిపత్రం పంపినట్లు బీజేపీ మండల పార్టీ మాజీ అధ్యక్షుడు, ఆర్‌టీఐ జిల్లా అధ్యక్షుడు అక్కపెల్లి రవీందర్ తెలిపారు. గ్రామ పంచాయతీల కార్యదర్శులు, వైద్య సిబ్బంది ప్రజలకు గ్రామాలలో అందుబాటులో ఉండి సేవలు అందించాలని కోరారు. తాగు నీటి బావులలో బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తూ, రోడ్లపై చెత్త లేకుండా చర్యలు తీసుకొనేలా ఆదేశాలు ఇవ్వాలని కోరినట్లు తెలిపారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

జగిత్యాల అర్బన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణానికి చెందిన మాజీ వార్డు సభ్యులు గుర్రం రాము తల్లి లలిత అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబాన్ని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మంగళవారం రాత్రి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన వెంట పలువురు మాజీ కౌన్సిలర్‌లు, నాయకులు ఉన్నారు.

●**కొడిమ్యాల:** మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు గడ్డం లక్ష్మారెడ్డి తల్లి గడ్డం బాగ్యమ్మ(60)అనారోగ్యంతో మంగళవారం మృతి చెందింది. చొప్పదండి మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ మృతురాలి కుటుంబ సభ్యులను ఓదార్చి మృతురాలికి నివాళులు అర్పించారు. మాజీ ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ నాయకులు వెంకటేష్‌గౌడ్, స్వామి, ఆనందం, రాజు, చంద్రశేఖర్ ఉన్నారు.

ప్రధాన పార్టీల్లో గ్రూపు రాజకీయాలు

(ఐదో పేజీ తరువాయి)

పార్టీ కార్యాకలాపాలను నిర్వహిస్తున్నారు. దీనికితోడు 2024లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ భోగ శ్రావణి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి పాలైంది. దీంతో అప్పటి నుంచి ఆమెది మరో వర్గంగా కొనసాగుతోంది. జగిత్యాల బీజేపీ రాజకీయాలపై పట్టు ఉన్న నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ తీసుకోబోయే నిర్ణయాలపై పార్టీ భవిష్యత్తు ఆధారపడి ఉంటుందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. కొన్ని సంవత్సరాలుగా బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించిన మోరపల్లి సత్యనారాయణ ఇటీవల పదవీ కాలం ముగియడంతో మెట్‌పల్లికి చెందిన నాయకుడు డాక్టర్ యాదగిరికి జిల్లా బాధ్యతలను పార్టీ అప్పగించింది. అయితే జగిత్యాల రాజకీయాలపై పార్టీ జిల్లా అధ్యక్షుడు యాదగిరి అంతగా దృష్టి సారించడం లేదని కార్యకర్తలు అంటున్నారు. ఈ పరిస్థితుల్లో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గట్టెక్కేదెలా అని కార్యకర్తల్లో ఆందోళన నెలకొంది. ఇలా అన్ని ప్రధాన పార్టీల్లో పలువురు రాజకీయ నాయకులు తమ అనుచర వర్గాలతో పార్టీల కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. బహుళ నాయకత్వాలపై ఆయా పార్టీల అధిష్ఠానాలు దృష్టి సారిస్తేనే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

-మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్

కోరుట్ల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ అన్నారు. దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని లోతట్టు ప్రాంతాల్లో గుంతలమయం అయిన రహదారులతో పాటు ఖాళీ ప్రాంతాల్లో వర్షపు నీరు నిలువ ఉండకుండా ఇండ్ల నిర్మాణంలో వచ్చే వ్యర్థాలను నింపుతున్నట్లు తెలిపారు. డెంగ్యూ, మలేరియా వ్యాధులు రాకుండా తగు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. దుకాణదారులు ట్రేడ్ లైసెన్స్‌ను పొంది వ్యాపారాలను నిర్వహించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు రాజేంద్రప్రసాద్, ఆశోక్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా బోనాల ఊరేగింపు


బోనాలతో ఊరేగింపుగా బయల్దేరిన మహిళలు

కోరుట్ల రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల మండలంలోని చిన్నమెట్‌పల్లి గ్రామంలో మంగళవారం రేణుక ఎల్లమ్మ దేవతకు బోనాల మహోత్సవం ఘనంగా నిర్వహించారు. మహిళలు నెత్తిన బోనం పెట్టుకొని గ్రామంలోని పురవీధుల గుండా బోనాల ఊరేగింపు నిర్వహించారు. మహిళలు గ్రామశివారులోని రేణుక ఎల్లమ్మ దేవాలయం వరకు బోనాలతో ఊరేగింపుగా వచ్చారు. పోతరాజుల చేసిన నృత్యాలు అకట్టుకున్నాయి. పంటలు బాగా పండి ప్రజల ఆరోగ్యాలు బాగుండాలని ప్రత్యేక పూజలు నిర్వహించి బోనాలను అమ్మవారికి సమర్పించారు.

నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్

-ప్రయాణికుడు పోగొట్టుకున్న బంగారు చైన్ అప్పగింత

ధర్మపురి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణానికి చెందిన ఆటో డ్రైవర్ నూగూరి నగేష్ తనకు దొరికిన బంగారు చైన్‌ను బాధితుడికి మంగళవారం అప్పగించి నిజాయితీ చాటుకున్నారు. ధర్మపురి లక్ష్మీ నరసింహకాలనీకి చెందిన కొత్తపెల్లి కిషన్ తన కొడుకును హైదరాబాద్ బస్ ఎక్కించేందుకు గత రాత్రి బస్‌స్టేషన్ వచ్చాడు. కొడుకు బస్ ఎక్కిన అనంతరం తన మెడలోని బంగారు చైన్‌ను పోగొట్టుకున్నాడు. రాత్రి వేళలో, ఉదయం ఆయన బస్‌స్టేషన్ వద్దకు వచ్చి వెతికాడు. ఆ సమయంలో స్థానిక బస్‌స్టేషన్ వద్ద ఆటోడ్రైవర్ నగేష్‌కు దొరికిన బంగారు చైన్‌ను ఆయనకు చూపించాడు. వెంటనే ఆయన ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్ఐ ఉదయ్‌కుమార్‌కు సమాచారం అందించి బంగారు చైన్ బాధితుడు కిషన్‌కు అప్పగించాడు. అనంతరం సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్ఐ ఉదయ్‌కుఆర్ ఆటో డ్రైవర్‌ను శాలువా కప్పి ప్రత్యేకంగా అభినందించారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన


రత్నాపూర్‌లో సీసీ రోడ్డును పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మల్లాపూర్, జూన్17 (ఆంధ్రజ్యోతి): మల్లాపూర్ మండలంలోని రత్నాపూర్ గ్రామంలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను మాజీ జడ్పీటీసీ, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి నాయకులతో కలిసి పరిశీలించారు. గ్రామంలో ఈజీఎస్ నిధులు రూ.10లక్షలతో నిర్మిస్తున్న రోడ్డు నాణ్యత పనులను పరిశీలించారు. కార్యక్రమంలో మల్లాపూర్ మాజీ ఎంపీపీ నల్ల రాజన్న, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, అంతడుపుల నర్సయ్య, ఆనంద్‌గౌడ్, రవి, తదితరులు పాల్గొన్నారు.

చెరువును నింపేందుకు కాలువ స్థలం పరిశీలన

కథలాపూర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తక్కళ్ళపల్లిలోని ఉదకమ్మ చెరువు మత్తడి నుంచి వృథాగా పోతున్న నీటితో పాడి చెరువును నింపేందుకు మంగళవారం ఇరిగేషన్ డీఈఈ ప్రశాంత్ స్థలం పరిశీలించారు. గత రెండు రోజుల కిందట తక్కళ్ళపల్లికి చెందిన పలువురు రైతులు వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను కలిసి పాడి చెరువు నింపడానికి నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే ఇరిగేషన్ డీఈఈని ఆదేశించడంతో పాడి చెరువును నింపేందుకు ఉన్న పలు మార్గాలను రైతులతో కలిసి పరిశీలించారు. రెండు రోజుల్లో ఏఈలను పంపించి అంచనాలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు నివేదిస్తామని డీఈఈ తెలిపారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ బీసీ విభాగం అధ్యక్షుడు అల్లకొండ లింగంగౌడ్, దమ్మ తిరుపతిరెడ్డి, భూపెల్లి రాజగంగారాం ఉన్నారు.

సింగిల్‌విండో అభివృద్ధికి కృషి చేయాలి

కొడిమ్యాల, జూన్17(ఆంధ్రజ్యోతి): సింగిల్‌విండో అభివృద్ధికి రైతులు కృషి చేయాలని చైర్మన్ మెన్నేని రాజనర్సింగరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సింగిల్ విండోలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రైతులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి సంఘం అభివృద్ధికి దోహద పడాలన్నారు. నూతనంగా చేరిన సభ్యులకు రుణాలను మంజూరు చేయాలని తీర్మాణం చేశారు. సమావేశంలో ఉపాధ్యక్షురాలు కవితచంద్రమోహన్‌రెడ్డి, పర్సన్ ఇంచార్జులు, కార్యదర్శి గంగాధర్, సిబ్బంది, పాల్గొన్నారు.

'స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం'

జగిత్యాల రూరల్, 17(ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు సరైన బుద్ధి చెప్పుతారని జడ్పీ మాజీ చైర్ పర్సన్ దావ వసంతసురేష్ అన్నారు. రూరల్ మండలం చల్‌గల్ గ్రామంలో మంగళవారం నిర్వహించిన గ్రామ సమన్వయ కమిటీ సమావేశానికి మాజీ చైర్‌పర్సన్ హాజరై మాట్లాడుతూ ప్రజలు కేసీఆర్ పాలన కావాలని కోరుకుంటున్నారన్నారు. మోసపూరిత హామీలను ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఆనందరావు, సీనియర్ నాయకులు గంగారెడ్డి, మాజీ సర్పంచు ఎల్ల గంగనర్సు రాజన్న, పద్మతిరుపతి, ఆసీఫ్, శ్రీనివాస్, చందు, పోచమల్లు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

కోరుట్ల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కిశోర్ బాలలకు ఆట పాటలతో కూడిన విద్యను అంగన్ వాడి కేంద్రాలలో అందుతుందని అంగన్‌వాడి సూపర్ వైజర్ అల్వాల భారతి పేర్కోన్నారు. మంగళవారం పట్టణంలోని బాలాజీ రోడ్డులోని అంగన్ వాడి కేంద్రాలో ప్రీ స్కూల్ విద్యపై కిశోర బాలల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి ప్రభుతాలు అందిస్తున్న ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. అంగన్ వాడి కేంద్రాలలో విద్యార్థులకు మంచి అలవాట్లతో పాటు విద్యాభాసం అందుతుందని అన్నారు. అంగన్ వాడి కేంద్రాలలో చేరిన విద్యార్థులకు సామూహిక అక్షరాభాస్యం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడి టీచర ఇమ్రాన్‌లతో పాటు విద్యార్థుల తల్లి దండ్రులు పాల్గొన్నారు.

●జగిత్యాలరూరల్: చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రాజశ్రీ అన్నారు. జగిత్యాల రూరల్ మండలంలోని లక్ష్మీపూర్, జాబితాపూర్, లక్ష్మీపూర్, గుల్లపేట, తిమ్మాపూర్, రఘురాముల కోట గ్రామాల్లో మంగళవారం అమ్మ మాట- బంగారుబాట కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు అంగన్‌వాడీకేంద్రాల్లో అక్షరాభ్యాసం నిర్వహించారు.

●కొడిమ్యాల: మూడు సంవత్సరాలు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలలో తప్పనిసరిగా నమోదు చేయించాలని ఐసీడీఎస్ మల్యాల ప్రాజెక్ట్ ఏసీడీపీవో అరవింద అన్నారు. మంగళవారం మండలంలోని హిమ్మతురావుపేట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలలో అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని ఏసీడీపీవో ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచు కృష్ణారావు, సూపర్‌వైజర్ ఉమా, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు. మండలంలోని పూడూర్ అంగన్‌వాడీ కేంద్రాలలో సూపర్‌వైజర్ సుధారాణి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. తిప్పయ్యపల్లి అంగన్‌వాడీ కేంద్రాలలో అంగన్‌వాడీ టీచర్లు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అమ్మ మాట అంగన్‌వాడీ బాట ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో సూపర్‌వైజర్లు ఉమా, సుధారాణి, అంగన్‌వాడీ టీచర్లు రాజమణి, సుశీల, పుష్ప, మౌనిక, కనకమ్మ, ఆనందలక్ష్మీ, సునిత, రమాదేవి, రాజ్యలక్ష్మీ, సురేఖ, వసంత, స్నేహలత, పుష్పలత, పద్మ, తల్లులు, అంగన్‌వాడీ ఆయాలు పాల్గొన్నారు.


హిమ్మతురావుపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

●కథలాపూర్ : మండలంలోని ఇప్పపల్లిలో ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీల ప్రాధాన్యంను వివరించి వీధుల వెంట ర్యాలీ చేపట్టారు. బాలింతలు, గర్భిణీలు, చిన్నారులకు పౌష్టికాహారం అందుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్రవంతి చెప్పారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ రాజమణి తదితరులు ఉన్నారు

●రాయికల్: మండలంలోని ఒడ్డెర కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం అమ్మ మాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ సుజాత ఆధ్వర్యంలో పిల్లలకు అక్షరాభ్యాసం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి దివ్య జ్యోతి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మోహన్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

●పెగడపల్లి: అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులను చేర్పించాలని పెగడపల్లి మండల ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మహేశ్వరి, సుభద్రలు పేర్కొన్నారు. పెగడపల్లి మండలంలోని బతికెపల్లి, రాజారాంపల్లి గ్రామాలలోని అంగన్‌వాడీ కేంద్రాలలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించడంతో పాటు బడి బాట ర్యాలీలు నిర్వహించారు. సూపర్‌వైజర్లు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యతో పాటు చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారం గూర్చి అవగాహన కల్పించారు. కార్యక్రమాలలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

అంతర్జాతీయ కరాటే దినోత్సవం

మెట్‌పల్లిటౌన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సమావేశ మందిరంలో అంతర్జాతీయ కరాటే దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. జగిత్యాల జిల్లా చీఫ్ ఇన్‌స్ట్రర్ పసునూరి అవినాష్ ఆధ్వర్యంలోని కరాటే విద్యార్థులతో ప్రపంచ కరాటే డేని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరాటే విద్యార్థులు కరాటే విన్యాసాలు చేసి అనంతరం కేక్ కట్ చేసి మిఠాయి పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మెట్‌పల్లి ఎంఈఓ మేకల చంద్రశేఖర్, ఇబ్రహీంపట్నం మండలం ఎంఈఓ బండారి మధు చేతుల మీదుగా కరాటేలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెడల్స్ వేసి సర్టిఫికేట్ అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రులు చిన్ననాటి నుండే కరాటే శిక్షణ ఇప్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్ అవినాష్, శివాని, రోహిత్, రోషన్, విద్యార్థులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

గొల్లపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న భూసమస్యల శాశ్వత పరిష్కారానికే తెలంగాణ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి ఆర్‌వోఆర్-25 చట్టం రెవెన్యూ సదస్సులని తహసీల్దార్ కట్కం వరందన్ అన్నారు. మంగళవారం గొల్లపల్లి మండలం ఆత్మకూర్ గ్రామంలో భూభారతి ఆర్‌వోఆర్-25 నూతన చట్టం పై రెవెన్యూ సదస్సులను రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకుని భూసమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ సూచించారు.

అనంతరం భూసమస్యల పరిష్కారం కోసం రైతులు ఇచ్చిన దరఖాస్తులను స్వీకరించారు. మొత్తం 168 దరఖాస్తులు వివిధ రకాల భూసమస్యలను పరిష్కరించాలని కోరుతూ సమర్పించినట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు జీవన్, అనూష, ఏఎస్‌వో ప్రశాంతి, మమత, మమత తదితర రెవెన్యూ సిబ్బంది, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, రైతులు పాల్గొన్నారు.

●మల్యాల: మల్యాల మండలంలోని ముత్యంపేట, బల్వంతాపూర్‌లో మంగళవారం రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో భూభారతి గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా భూసమస్యలకు సంబందించి ఫిర్యాదులు స్వీకరించారు. భూసమస్యలు ఉన్నవారంత ఈ కార్యక్రమంను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తహసీల్దార్ వసంత, డీటీ నీత, ఆర్ఐలు రాణీ, తిరుపతి రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

●కొడిమ్యాల: కొడిమ్యాల మండలంలోని నమిలికొండ గ్రామంలో సోమవారం భూ భారతి గ్రామ సభను రెవెన్యూ అధికారులు నిర్వహించారు. గ్రామ సభలో ప్రజల నుండి 153 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ ఎం.కిరణ్‌కుమార్ తెలిపారు. గ్రామ సభలో ఆర్ఐ కరుణాకర్, మాజీ ప్రజాప్రతినిధులు, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు పంపిణీ

ధర్మపురి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని రాయపట్నం గ్రామంలో లబ్దిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు మంగళవారం పంపిణీ చేశారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆదేశాల మేరకు అర్హులైన 34 మంది లబ్దిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలు అందించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ధర్మపురి నియోజకవర్గ ఉపాధ్యక్షులు రాందేని మొగిలి మాట్లాడుతూ లబ్దిదారులు ఈ పత్రాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. త్వరగా ఇళ్లు నిర్మాణాలు చేపట్టి సకాలంలో పూర్తి చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి నియోజకవర్గ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రాందేని మొగిలి, గ్రామపంచాయితీ కార్యదర్శి నరేష్, కాంగ్రెస్ నాయకులు కమలాకర్, దేవరం, డేవిడ్, గంగరాజు, శ్రీకాంత్, వెంకటేష్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కొడిమ్యాల-వేములవాడ బస్సు ప్రారంభం

కొడిమ్యాల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని అంగడి బజారు నుంచి వేములవాడ వరకు ఆర్టీసీ బస్సును మాజీ సర్పంచ్ ఏలేటి మమతనర్సింహారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వేములవాడ డిపో అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

అందుబాటులో ఎరువులు

పెగడపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పెగడపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయని సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఓరుగంటి రమణారావు, తడుకమడ్ల గోపాల్ రెడ్డిలు తెలిపారు. మంగళవారం సంఘం కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ ఖరీఫ్ సాగుకు రైతన్నలకు అవసరమగు రసాయిక ఎరువులు అన్ని రకాల అందుబాటులో ఉన్నాయని వారు తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన దరలకే అన్ని రకాల ఎరువుల బస్తాలు రైతులకు సకాలంలో అందజేస్తున్నామని, ప్రైవేటు వ్యాపారుల వద్ద అదిక ధరలకు కొనుగోలు చేసి నష్టపోవద్దని వారు కోరారు.